క్లుప్తంగా

రేపటిలోగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: ఈ నెల 22వ తేదీలోగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండల రేషన్ డిపో డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్వోల సహకారంతో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ శతశాతం జరగాలన్నారు. కొన్ని గ్రామాల్లో పంపిణీ నత్తనడకన సాగుతుందన్నారు. ప్రతీ వినియోగదారునికి కార్డు అందించే బాధ్యత ఇద్దరిపై ఉందన్నారు. డీలర్ల సంఘ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


మొక్కలు నాటుతున్న ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎంపీడీవో ఎం. ఉషారాణి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె స్థానిక తహసీల్దార్ పి.సత్యనారాయణతో కలిసి ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఉపాధి ఏపీవో శివ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

పారిశుధ్య లోపం లేకుండా చర్యలు


ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాయకరావుపేట: గ్రామాల్లో మొక్కలు నాటడంతో పాటు పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని గ్రామ కార్యదర్శి వై.వి.సత్యనారాయణ తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శ్రీరాంపురంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


డ్రైనేజీ కాలువలు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో నిర్మాణంలో ఉన్న పలు డ్రైనేజీ కాలువలను శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస పరిశీలించారు. కాలువ నిర్మాణాల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆమె ఆదేశించారు. కాలువల నిర్మాణాలు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్కను నాటి నీరు పోస్తున్న డీటీ శ్యామ్

అచ్యుతాపురం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా అందరికీ ప్రాణవాయువు అందుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మంగళవరపుపేటలో డ్వాక్రా మహిళలతో మానవహారం చేస్తున్న వెలుగు అధికారులు(ఫైల్)

మహిళా సంఘాల్లో.. మొబైల్ బుక్ కీపింగ్

- మోసాలకు చెక్ పెట్టేందుకు యాప్ దోహదం
- మన డబ్బులు-మన లెక్కల పేరిట గ్రామాల్లో అవగాహన
- గతంలో లావాదేవీలపై కొరవడిన పారదర్శకత

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం



మహిళలను చైతన్య పరచడం కోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మన డబ్బులు-మన లెక్కల పేరిట బుక్ కీపింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ యాప్ ద్వారా ప్రతి నెలా సంఘ లావాదేవీలు తెలుసుకునే అవకాశం ఉంది. మోసాలకు గురయ్యే అవకాశాలు ఉండవు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

– బాలరాజు, వెలుగు ఏపీఎం, మునగపాక

మునగపాక: లెక్కల్లో పారదర్శకత, రుణాల్లో కచ్చితత్వం ఉండాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల్లో మొబైల్ బుక్ కీపింగ్ అమలులోకి తెచ్చారు. ప్రధానంగా మహిళల్లోని నిరక్షరాస్యతను కొంతమంది ఆసరాగా తీసుకొని డ్వాక్రా సంఘాల లావాదేవీల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇకపై అలాంటి మోసాలకు చెక్ పడనుంది. దీనిపై గ్రామాల్లో మన డబ్బులు-మన లెక్కల పేరిట అవగాహన కల్పిస్తున్నారు. ఇకపై ప్రతి నెలా తమ సంఘ లావాదేవీలను చూసుకునే వెసులుబాటు కల్పించారు.

డ్వాక్రా మహిళల్లో చైతన్యం

డ్వాక్రా మహిళలు తమ నెల వారీ లావాదేవీలకు సంబంధించి తెలుసుకునేందుకు వీలుగా మొబైల్ బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మన డబ్బులు-మన లెక్కల పేరుతో గ్రామాల్లో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంఘాల మహిళలతో కలిసి ర్యాలీలు, మానవహారాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.


ఒంపోలులో మహిళలతో ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు అధికారులు (ఫైల్‌ఫొటో)

పొదుపు-అప్పుల ప్రగతి తెలుసుకునే వెసులుబాటు..

ప్రతీ సంఘ సభ్యురాలు వ్యక్తిగత అవసరాల కోసం బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను వాయిదా పద్ధతిలో చెల్లిస్తుంటారు. ప్రతి నెలా పొదుపుతో పాటు రుణాలను బ్యాంక్‌లకు వెళ్లి చెల్లించాల్సి ఉంటుంది. అయితే మెజార్టీ మహిళలు తమ సంఘ అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా లావాదేవీలు జరుపుకుంటారు. ఇదే అదనుగా కొంతమంది మహిళలు సంఘ సొమ్మును దుర్వినియోగం చేస్తున్న సంఘటనలు లేకపోలేదు. అమాయక మహిళలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారు.

సొంత ఫోన్ కలిగి ఉంటే చాలు...

ఇకపై సంఘ సభ్యులకు సంబంధించి మోసాలకు చెక్ పెట్టేందుకు నూతనంగా అమలు చేస్తున్న మొబైల్ కీపింగ్ యాప్ దోహదం చేయనుంది. ప్రతీ మహిళ సొంత ఫోన్ కలిగి ఉంటే చాలు మోసాలకు గురికాకుండా ఉండగలరు. ప్రతి నెలా ఆఖరిలో లావాదేవీలకు సంబంధించి పూర్తి వివరాలు ఫోన్‌లో యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

పని గంటల పెంపు అన్యాయం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్: కార్మికుల పని విధానంలో 8 నుంచి 13 గంటలు పెంచుతూ రాత్రి సమయంలో మహిళలతో పనిచేయించడం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు కలిసి శనివారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడుదారులకు కార్మికుల శ్రమను దోచిపెడుతుందన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినం చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలోకి తొక్కుతున్నాయన్నారు. కార్మికుల 13 గంటల పని విధానం పెంపు, మహిళలకు రాత్రి డ్యూటీలు రద్దు చేయకుంటే కార్మికులను పెద్ద ఎత్తున సమీకరించి ప్రజా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్రి నాయుడు, నాగేశ్వర్రావు, పార్వతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి


పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


కోటవురట్లలో మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారి శోభారాణి

కోటవురట్ల: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల ప్రత్యేకాధికారి శోభారాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో మొక్కలు నాటడం ఒక భాగం కావాలన్నారు. మొక్కలను నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం, ఏపీవో నాగరాజు, పీఆర్ జేఈ వర్మ, ఏవో సరోజిని, హౌసింగ్ జేఈ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వై.రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులు కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు.

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగులకు 29 శాతం ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జె.వి.ఎ న్‌.పి. రాజేష్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. వీటిపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ రణభేరి జాతా నిర్వహించామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఈ నెల 25న గుంటూరులో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్రస్థాయి రణభేరి నిర్వహిస్తామన్నారు. దీనికి యూటీఎఫ్ సభ్యులు వేలాదిగా తరలిరావాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బీవీవీ రమణ, కట్టా శ్రీరామచంద్రమూర్తి, కట్టా శ్రీను, కోడి నానాజీ, డీ ఐజక్, గర్లంక సతీష్, కేఎస్ఆర్ రాజు, ఫణికుమార్, కట్టా లోవరాజు, వెలగా సూరిబాబు, కేవీవీ రామారావు, ఎం రామలక్ష్మి, నాగరాజు, జీ వాసు, డీజీ ఎన్‌జీ ప్రసూనాంబ, శివగణేష్, ఎస్ చంటి, సిహెచ్ వరప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి

అచ్యుతాపురం రూరల్: పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని అనకాపల్లి పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్రావు తెలిపారు. శనివారం కొండకర్లలో పోస్టల్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆవ సమీపంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఇటీవల బీమా పాలసీ తీసుకుని మృతి చెందిన ప్రవీణ్ కుమార్ కుటుంబీకులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ చుక్కా శ్రీనువాసరావు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వై.బి.పలసరావు, గ్రామ పెద్దలు కోట్ని శివ, పోస్ట్ మాస్టర్ భవానీ శంకర్, సహాయక ఇన్‌స్పెక్టర్ చిరంజీవులు, బీపీఎం నాగేశ్వర్రావు పాల్గొన్నారు.


కొండకర్ల ఆవ సమీపంలో మొక్కలు నాటుతున్న పోస్టల్ సిబ్బంది

పోషకాహారం శ్రేయస్కరం


మాట్లాడుతున్న చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి వై.రామకృష్ణ కోరారు. మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం స్వస్థ్ నారీ స్వసక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను, బీవీ రమణ, సూరిశెట్టి రాము, రామ జోగినాయుడు, ఆరోగ్య విస్తరణ అధికారి గుర్రం శ్రీనివాసరావు, హెచ్‌వీ బేగం, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్

నక్కపల్లి: ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. శనివారం నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజులు తయారీ బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు దాతారం మురళి మాట్లాడుతూ ఓటీపీ విధానం వల్ల లేఖర్లతోపాటు, కక్షిదారులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు గడువులోగా ఓటీపీలు ఎంటర్ చేయకపోవడంతో స్లాట్ రద్దయి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. ఓటీపీ విధానం రద్దు చేసి పాత విధానంలో రిజిస్ట్రేషన్లు కొనసాగించాలన్నారు. నవర రమణబాబు, సూర్యనారాయణ, ఉపేంద్ర, చౌదరి, జి. నూకరాజు, బి. రాజు, వరహాలు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన పెన్‌డౌన్

యలమంచిలి రూరల్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాల్లో మార్పులు చేయాలన్న డిమాండ్‌తో దస్తావేజు లేఖర్లు చేస్తున్న పెన్‌డౌన్ కారణంగా రెండో రోజు శనివారం యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కార్యకలాపాలకు బ్రేక్ పడింది. నిత్యం రద్దీగా ఉండే కార్యాలయం జనం రాకపోవడంతో బోసిపోయింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండి పడింది. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు శానాపతి రాము, పిల్లా నాగేశ్వర్రావు, శెలంశెట్టి నాగేశు, శెలంశెట్టి సూర్యప్రకాష్, అర్లె ఉమ, పంచదార్ల సురేష్, రావి నూకరాజు, పంచదార్ల లక్ష్మణ, గగనం రమేష్, ఓగిబోయిన శ్రీనివాసరావు, ఐతా శ్రీనివాసరావు, చంబకాయల లోవరాజు, గల్లా వెంకట నాగేశ్వర్రావు, కొఠారు శ్రీరాములునాయుడు, పిట్టా ఆనంద్, దాసరి నానాజీ, అప్పికొండ లోకేష్, ఆళ్ల సోమునాయుడు, తమ్మిశెట్టి జయలక్ష్మి, షేక్ ఖాసీమ్, పిల్లా స్వామి, సీతరమణ పాల్గొన్నారు.


నక్కపల్లిలో నిరసనతెలియజేస్తున్న దస్తావేజు లేఖర్లు

24న విశాఖ డెయిరీ వద్ద రైతుల ధర్నా

అనకాపల్లి: ఉత్తరాంధ్రలో పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 24న విశాఖ డెయిరీ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు విశాఖ డెయిరీ పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ధర్నా పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల జనరల్ బాడీ సమావేశంలో డెయిరీ యాజమాన్యం లీటరు పాల ధర రూ.10 పెంచాలని కోరారు. సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


బయ్యవరంలో మొక్కలు నాటుతున్న అధికారులు, సిబ్బంది


యలమంచిలి పట్టణం రాళ్లచెరువు వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు


ఎస్.రాయవరం సచివాలయంలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ

యలమంచిలి రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ ప్రసాద్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శనివారం బయ్యవరం అంగన్‌వాడీ భవనం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె. శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ వి. దీపిక, నరేగా, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పులపర్తి జెడ్పీ పాఠశాల వద్ద మొక్కలు నాటారు. యలమంచిలి పట్టణంలో రాళ్లచెరువు వద్ద భారీగా మొక్కలు నాటారు. చైర్‌పర్సన్ రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌కు తోడ్పాటు కావాలని డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా సర్వసిద్ధి, ఎస్.రాయవరం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయ ప్రాంగణాల్లో పలు రకాలు మొక్కలు నాటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శులు రమేష్‌బాబు, రామలక్ష్మి పాల్గొన్నారు.


సర్వసిద్ధి పాఠశాలలో విద్యార్థులకు గ్రీన్ ఆంధ్రా ప్రయోజనాలు చెబుతున్న అధికారులు

వాడ్రాపల్లిలో కుంకుమార్చన


కుంకుమ పూజల్లో భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి రామాలయం ప్రాంగణంలో కుంకుమార్చనకు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సేవా కర్త పెతకంశెట్టి రామజోగినాయుడు మాట్లాడుతూ నెల రోజులుగా ఇక్కడ పెదరామాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ సీహెచ్ సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, శరగడం పరదేశినాయుడు, కొయిలాడ దశావతారం, మళ్ల వరహా నరసింగరావు, మళ్ల శేషు, మళ్ల కన్నుంనాయుడు, కొణతాల శివ రామకృష్ణ, మళ్ల అప్పలనాయుడు, లీలా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో భారీ అన్నసమారాధన

మునగపాక: స్థానిక సంతబయిల పురాతన వినాయక దేవాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు ప్రజలు భారీగా తరలివచ్చారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అనకాపల్లికి చెందిన సత్యనారాయణ థియేటర్ అధినేత కొణతాల రామలింగస్వామి ప్రారంభించారు. ములబంద గోడీ రైతు సంఘం, సిద్ధి వినాయక మహిళా మండలి సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వీరికి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మందపాటి నరసింగరావు(రాము) ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ నెల 24వ తేదీన వినాయక అనుపు మహోత్సవం జరుగుతుందని రాము తెలిపారు.


అన్నసమారాధన ప్రారంభిస్తున్న అనకాపల్లి సత్యనారాయణ థియేటర్ అధినేత రామలింగస్వామి

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

పాయకరావుపేట: విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎం.వినోద్ బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఐటీఐ, నీట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించాలన్నారు. బోధన, ఇతర విషయాలపై అధ్యాపకులకు తగు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థుల విద్యాభ్యాసం, హాజరుపై ప్రిన్సిపాల్ కె.శైలజను అడిగి తెలుసుకున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న వినోద్ బాబు

దసరా ముందే వచ్చింది..


దేవతా మూర్తుల వేషధారణలలో విద్యార్థులు

కోటవురట్ల: సర్కారు బడుల్లో దసరా సందడి ముందే వచ్చేసింది. దసరా సెలవులు రావడంతో కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో దసరా వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు దుర్గాదేవి, మహిషాసురుడు, ఇతర దేవతామూర్తుల వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటారని తెలిపారు. ఈ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.